www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 15 జూన్ 2025
5
కాకినాడ



16న యథావిధిగా పిజిఆర్ఎస్

ప్రజాశక్తి-కాకినాడ

ప్రజా సమస్యల పరిష్కారం నిమిత్తం ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పిజిఆర్ఎస్) కార్యక్రమం జిల్లా స్థాయిలో జూన్ 16న సోమవారం కాకినాడ కలెక్టరేట్ గ్రీవెన్స్ హాల్లో ఉదయం 10 గంటల నుంచి 1 గంట వరకు నిర్వహింస్తామని జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల స్థాయిలో నిర్వహించే పిజిఆర్ఎస్ కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు అందరూ విధిగా ఉదయం 9:30 గంటలకు హాజరుకావాలని ఆదేశించారు. అర్జీదారులు కార్యక్రమానికి రాలేనప్పుడు, వారి అర్జీలను Meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవచ్చునని తెలిపారు. సమాచారం తెలుసుకోవడానికి 1100కి కాల్ చేయవచ్చని తెలిపారు.

అరకొరగా విద్యార్థి మిత్ర కిట్లు

- తెరుచుకున్న పాఠశాలలు
- కొంతమందికే 'విద్యార్థి మిత్ర' కిట్లు
- కిట్స్‌లో లేని పూర్తిస్థాయిలో వస్తువులు
- విద్యాశాఖపై ప్రభుత్వ నిర్లక్ష్యం

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

ఈ నెల 12 నుంచి పాఠశాలలు పున్ణ ప్రారంభం అయ్యాయి. పాఠశాలలు తెరిచిన రోజునే 'విద్యార్థి మిత్ర' కిట్లను పూర్తిస్థాయిలో పంపిణీ చేస్తామని ఒక పక్క ప్రభుత్వం, మరోవైపు అధికారులు చెప్పుకొచ్చారు. కానీ క్షేత్ర స్థాయిలో అన్నీ ఇంకా చేరుకోలేదు. ఈ కిట్లలో పలు వస్తువులు ఇంకా జిల్లాకు రాలేదు.

కాకినాడ జిల్లాలో 1283 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో 1,37,337 మంది విద్యార్థులు చదువుతున్నారు. సర్వేపల్లి రాధాకష్ణన్ విద్యార్థి మిత్ర (ఎస్ఆర్ కెవిఎం) కిట్‌లో నోటు పుస్తకాలు, పాఠ్య పుస్తకాలు, బెల్ట్, ఒక జత షూస్, రెండు జతల సాక్స్, డిక్షనరీ, మూడు జతల యూనిఫాం, బ్యాగు ఇస్తున్నారు.

కుట్టించుకునేందుకు కుట్టి కూలీ ఇస్తారు. వేసవి సెలవుల్లోనే ఈ కిట్లను పాఠశాలలు తెరిచే రోజునే విద్యార్థులకు పంపిణీ చేస్తారు. అందుకు తగ్గట్టు అధికారులు అన్ని పాఠశాలలకూ వీటిని అందించాలి. కానీ ఆచరణలో పూర్తిస్థాయిలో సామగ్రి చేరుకోలేదు. విద్యాశాఖ మంత్రిగా నారా లోకేష్ పని చేస్తుండగా గత ప్రభుత్వానికి ధీటుగా విద్యా రంగాన్ని ప్రక్షాళన చేస్తామని చెప్పుకొచ్చారు. కానీ పాఠశాలలు తెరిచిన వెంటనే ఇవ్వాల్సిన కిట్ల విషయంలో మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తాయి. ఒక్కో దానికి రూ.2,300 ఖర్చు చేసి ఇస్తున్నామని గొప్పలు చెప్పినా ఆచరణలో పూర్తిస్థాయిలో వస్తువులను అందివ్వలేదని పలువురు విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల ప్రారంభం రోజునే పూర్తిస్థాయిలో కిట్లను ఇవ్వాల్సి ఉన్నా ఎందుకు పంపిణీ చేయలేదనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.




విద్యార్థి మిత్ర నమూనా కిట్

అరకొరగానే బ్యాగులు, యూనిఫామ్,

జిల్లాలో 1 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులందరికీ కలిపి 6,76,055 పాఠ్యపుస్తకాలు, 9,06,102 నోటు పుస్తకాలు, 13,621 ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలు, 83,099 బెల్ట్‌లు అవసరమవుతాయి. ఇవన్నీ ఇప్పటికీ ఆయా పాఠశాలలకు చేరాయి. 1,28,998 బ్యాగులు అవసరం కాగా ఇప్పటి వరకూ 22,735 మాత్రమే చేరుకున్నాయి. కేవలం గొల్లప్రోలు మండలానికి 4180, కిర్లంపూడి మండలం 4,420, పిఠాపురం మండలానికి 7,568, యు.కొత్తపల్లి మండలానికి 6,567 మాత్రమే చేరుకున్నాయి. యునిఫామ్ కూడా అరకొరగానే వచ్చాయి. 1,28,998 చేరుకోవాల్సి ఉండగా 18,543 మాత్రమే వచ్చాయి. కాజులూరు మండలానికి 3873, పిఠాపురం 7,568, తాళ్లరేవు మండలానికి 7102 అందాయి. షూస్ 1,26,792 రావాల్సి ఉండగా ఒక్కటి కూడా చేరుకోలేదు. వచ్చిన వాటిల్లో ఇంకా ఆయా పాఠశాలలకు పూర్తిస్థాయిలో చేరుకోని కారణంగా విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలలు ప్రారంభం నాటికే అన్ని వస్తువులూ పూర్తిస్థాయిలో పుస్తకాలు అందజేస్తామని విద్యాశాఖ అధికారులు ఏటా చెబుతున్నా ఆచరణలో విఫలమవుతున్నారు. ఈ సంవత్సరం కూడా ఇదే పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో పూర్తిస్థాయిలో అన్ని వస్తువులు చేరేలా ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని, అలాగే కిట్లను నాణ్యతతో అందివ్వాలని పలువురు తల్లిదండ్రులు ముక్తకంఠంతో కోరుతున్నారు.


పాఠశాలలకు వచ్చిన పుస్తకాలు



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న నాయకురాలు రమణి

అందరికీ ఉపాధి పనులు కల్పించాలి

ప్రజాశక్తి -కరప

గ్రామీణ ఉపాధి హామీ పనులు అందరికీ కల్పించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) కాకినాడ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. శనివారం కరపలో ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి సిహెచ్.రమణి ఉపాధి హామీ కార్మికులతో మాట్లాడుతూ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పోరాడి సాధించుకున్నట్టు గుర్తు చేశారు. పురుషులకు మాత్రమే పని ఉంటోందని, మహిళలకు పని లేదని చెప్పకపోవడం అన్యాయం అన్నారు. ఒంటరి మహిళలు కుటుంబాన్ని ఎలా గడుపుకోవాలని విమర్శించారు. ప్రభుత్వం మొక్కుబడిగా మాత్రమే పనులు కల్పిస్తోందని, చిత్త సుద్ధితో పని చేయడం లేదని, కార్మికులకు జిల్లా వ్యాప్తంగా సుమారు రూ.300 కోట్ల బకాయి పెట్టిందన్నారు. మండుటెండలో పని చేస్తే నేటికీ వేతనాలు ఇవ్వకపోతే ఏం తిని బతకాలని వాపోయారు. వెంటనే బకాయి వేతనాలు ఇవ్వాలని అందరికీ పని చెప్పాలని 200 రోజులకు పని పెంచాలని రూ.600 వేతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మహాలక్ష్మి దుర్గాదేవి, సత్యవతి మహాలక్ష్మి, జగ్గారావు వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

మత్స్యసంపద సమృద్ధిగా లభించాలి

ప్రజాశక్తి-కాకినాడ

మత్స్య సంపద సమృద్ధిగా లభించి, మత్స్యకార కుటుంబాలు సుఖ సంతోషాలతో జీవించాలని కాకినాడ సిటీ ఎంఎల్ఎ వనమాడి వెంకటేశ్వర రావు ఆకాంక్షించారు. వేట విరామం అనంతరం మళ్లీ సముద్రంలో వేటకు బయలు దేరే సమయంలో కాకినాడ ఏటిమొగలో కాకినాడ మెకనైజ్డ్ ఫిషింగ్ బోట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గంగమ్మ తల్లికి కుంభం సమర్పించి, ప్రజలందరికీ అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ కొండబాబు మాట్లాడుతూ ఏటా ఏప్రిల్ 15 నుండి జూన్ 15 వరకు మత్స్యకారులకు సముద్రంలో వేట నిషేధం అమలు ఉంటుందని, వేట విరామం సమయంలో మత్స్యకారులకు ప్రభుత్వం తరుపున రూ.20 వేల చొప్పున అందజేసి ఆదుకున్న ఘనత సిఎం చంద్రబాబుదేనన్నారు. ఈ కార్యక్రమంలో వాసిరెడ్డి ఏసుదాసు, సంగాని నాగేశ్వరరావు, బలసాడి రంగారావు, పినపోతు తాతారావు, మల్లాడి రాజు, పాలెపు ధర్మారావు, లంకే నూకరాజు, నాటి ధర్మారావు, చెక్కా లక్ష్మణరావు, వనమాడి కోయరాజు, పినపోతు శ్రీనివాస్, లంకాడి వీర్రాజు, కొంపెల్ల రాంబాబు, పొన్నాడ లోకేష్ వర్మ, పెమ్మాడి విశాఖ, చింతా పెర్రాజు, సంగాని ధర్మారావు పాల్గొన్నారు.


పూజలు నిర్వహిస్తున్న ఎంఎల్ఎ కొండబాబు

బీచ్ రోడ్‌లో ట్రాఫిక్‌కు అంతరాయం

ప్రజాశక్తి -యు.కొత్తపల్లి

ఉప్పాడ కాకినాడ బీచ్ రోడ్‌లో పర్యాటకుల తాకిడి అధికంగా ఉండడంతో శనివారం సాయంత్రం ట్రాఫిక్ జామ్ కావడంతో వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు. వేసవి సెలవులు ముగియడంతో తిరుగు ప్రయాణమయ్యే వాహనదారులు అధికం కావడం, పర్యాటకుల తాకిడి ఎక్కువగా ఉండడంతో వాహనాలను రోడ్డుకు ఇరువైపులా నిలుపుదల చేశార. దీంతో కిలోమీటర్ మేర నేమాం సమీపం వరకు వాహనాలు నిలిచిపోయాయి. ట్రాఫిక్‌ను నియంత్రించాల్సిన పోలీసులు లేకపోవడంతో వాహనదారులు అసహనం వ్యక్తం చేశారు.


బీచ్ రోడ్‌లో నిలిచిపోయిన వాహనాలు


మండలంలో ప్రారంభమైన ఎరువాక పనులు

జోరుగా ఏరువాక

ప్రజాశక్తి- సామర్లకోట

మండలంలో సార్వా సీజన్‌కు సంబంధించి ఏరువాక పనులను రైతులు ప్రారంభించారు. మండలంలో వరిసాగుకు అవసరమైన నారు మడుల పనులకు రైతులు శ్రీకారం చుట్టారు. ఏటా ఏరువాక పౌర్ణమికి సాగు సన్నాహాలు చేసి, తొలకరి పనులను రైతులు ప్రారంభిస్తారు. ఈ ఏడాది జూన్ 10వ తేదీ దాటే వరకూ ఎండల వేడి కొనసాగడం, ప్రస్తుతం వాతావరణం చల్లబడి వర్షాలు పడుతుందటంతో పాటుసాగుకు జలాలు అందుబాటులో ఉండటంతో రైతులు ఎరువాక పనులను ప్రారంభించారు. మండలంలోని జి.మేడపాడు, వేట్లపాలెం, హుస్సేన్‌పురం గ్రామాలు సహా పలు ప్రాంతాల్లో రైతులు నాట్లు వేసేందుకు నారుమడులు సిద్ధం చేస్తున్నారు. మండలంలో ఈ సీజన్‌లో సుమారు 22,200 ఎకరాల్లో వరి పంట సాగుకు రైతులు సన్నద్ధం అవుతున్నట్టు వ్యవసాయ శాఖ అంచనా వేస్తోంది. ఎపి సీడ్స్ ద్వారా విత్తనాల పంపిణీకి వ్యవసాయ శాఖ ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపారు. మరో వైపు సార్వా సీజన్‌లో ధాన్యం కొనుగోలు బకాయిల కోసం ఎదురుచూపులు చూస్తున్నారు.

మోకాళ్లపై నిలబడి ఇంజినీరింగ్ కార్మికుల నిరసన

ప్రజాశక్తి - పెద్దాపురం

ఇంజనీరింగ్ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె శనివారం 39వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న సమ్మె శిబిరంలో ఇంజినీరింగ్ కార్మికులు మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు సుంకర నాగేశ్వరరావు మాట్లాడుతూ 39 రోజులుగా ఇంజనీరింగ్ కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం నిరవధిక సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం అన్యాయమన్నారు. ఈ నిరసనలో బాసిన భద్రరావు, కె.వెంకటరమణ, ఆకుల రామకష్ణ, వాకాడ భాస్కర్, సుంకర సత్తిరాజు, డి.రాజు, పి.శ్రీను, ఎం.భద్రరావు, బి.భద్రరావు, జి.సతీష్, జి.నాగేశ్వరరావు, మహాపాతిన పాపారావు, అరుణ, అయ్యప్ప స్వామి, టి.సాయి, ఎస్‌కె.బషీర్ పాల్గొన్నారు.


మోకాళ్లపై నిలబడి ఇంజనీరింగ్ కార్మికుల నిరసన


విద్యార్థులను అభినందిస్తున్న ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప

ఘనంగా రక్త దాతల దినోత్సవం

వరల్డ్ బ్లడ్ డోనర్స్ డేను పురస్కరించుకుని శనివారం పలుచోట్ల రక్తదాన శిబిరాలు నిర్వహించారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

గండేపల్లి సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ, కాకినాడ జిజిహెచ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఆదిత్య డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ శిబిరంలో వైద్యాధికారి డాక్టర్ బి.శ్రీహరిబాబు, సిబ్బంది వైద్య సేవలందించారు. అధ్యాపకులు, సిబ్బంది 60 యూనిట్ల రక్తదానం చేశారు. వారి అందరినీ డాక్టర్ ఎం.శ్రీనివాస రెడ్డి అభినందిస్తూ సర్టిఫికెట్ ప్రదానం చేశారు. ఈ శిబిరం విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ మేడపాటి శ్రీనివాస రెడ్డి, వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎంబి.శ్రీనివాస్, ప్రో వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎ.రమేష్, ప్రో వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎస్.రమశ్రీ, రిజిస్ట్రార్ డాక్టర్ జి.సురేష్, డీన్ అడ్మిన్ ప్రొఫెసర్ వి.సత్యనారాయణ, డీన్ స్టూడెంట్ అఫైర్స్ డాక్టర్ డి.కిషోర్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ బి.వర ప్రసాద్, ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ ఐ.వీరాంజనేయులు, సిహెచ్.రామ ప్రసాద్ తెలిపారు.

పెద్దాపురం లెక్చరర్స్ కాలనీలోని రోటరీ బ్లడ్ బ్యాంకులో 22 మంది రక్తదానం చేశారని రోటరీ బ్లడ్ బ్యాంక్ కమిటీ తెలిపింది. మన ఇల్లు ఆశ్రమం నిర్వాహకులు సత్యనారాయణ 50 వ సారి రక్తదానం చేయగా, మాజీ కౌన్సిలర్ గెడ్డం పెదకాపు రక్తదానం చేసిన వారిలో ఉన్నారు. మట్టే ప్రసాద్, డిఎస్.వెంకటేశ్వరరావు, చౌదరి, గంగాధరుడు వారిని అభినందించారు.


కాకినాడలో రక్తదానం చేస్తున్న అలయన్స్ క్లబ్ సభ్యులు

కాకినాడ ఆలయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రోటరీ బ్లడ్ బ్యాంక్‌లో క్లబ్ అధ్యక్షుడు యాళ్ళ రత్నరావు ఆధ్వర్యాన రక్తదానం చేశారు. క్లబ్ కార్యదర్శి ధూళిపూడి రామకృష్ణ, జిల్లా ఛైర్మన్ పడాల సూర్యనారాయణ రెడ్డి, సభ్యులు కోలా సాయిబాబా, వి.గోవింద్, జి.జయసూర్య, బి.వెంకట లచ్చారావు, ఎం.సతీష్, యాళ్ల గోపీకృష్ణ రక్తదానం చేశారు. పెంకే గోవిందరాజు, టిఆర్ ఠాగూర్, కొవ్వూరి మునిరెడ్డి, దిలీప్ కుమార్ సదనాని, పి.కామరాజు, యక్కల వీరమోహన్‌రావు, పి. సేతు మాధవరావు, క్లబ్ కోశాధికారి దామిశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తల్లికి వందనం ఎగ్గొట్టేందుకు కూటమి ప్రభుత్వం కుట్ర


ప్రజాశక్తి-కిర్లంపూడి

ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి రూ.15000 చొప్పున ఆర్థిక సాయం అందిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక ఆంక్షల పేరుతో మోసం చేస్తున్నారని వైసిపి కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు అన్నారు. హామీలు గుప్పించిన కూటమి నాయకులు అధికారంలోకి వచ్చిన తర్వాత తల్లుల ఖాతాల్లో రూ.13 వేలు జమ చేశారని, మిగిలిన రూ.2 వేలు ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి జిల్లా కలెక్టర్ ఆధీనంలో ఉండే విధంగా జిఒను అమలు చేశారని తెలిపారు. ఎన్నికల్లో రూ.15 వేలు ఇస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు 2వేలు తగ్గించడం దారుణం అన్నారు. గత వైసిపి ప్రభుత్వంలో వైఎస్.జగన్మోహన్ రెడ్డి అమ్మ ఒడి పథకం పేరుతో ప్రవేశపెట్టిన పథకాన్ని కూటమి ప్రభుత్వం తల్లికి వందనంగా మార్చి విద్యుత్ వినియోగం, నెలసరి ఆదాయం, ఇంకా ఎన్నో నిబంధనల పేరుతో ఆంక్షలు విధించి వేలాది మంది విద్యార్థులను అనర్హులుగా ప్రకటించడం బాధాకరమన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ఎంతమంది పిల్లలు ఉంటే అంతమంది పిల్లలకు తల్లికి వందనం పథకం అమలు చేయాలని గిరిబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

తల్లికి వందనం విద్యార్థులకు ఒక వరం

ప్రజాశక్తి - సామర్లకోట


చదువుల్లో రాణించేందుకు విద్యార్థులకు 'తల్లికి వందనం' ఒక వరం అని పెద్దాపురం ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప, డిసిసిబి ఛైర్మన్ తుమ్మల రామస్వామి అన్నారు. సామర్లకోట 31వ వార్డు భాస్కరకాలనీకి చెందిన ముస్లిం మైనార్టీ కుటుంబనికి చెందిన గృహిణికి 'తల్లికి వందనం' పథకం ద్వారా ఒకేసారి ఐదుగురు పిల్లలకు నగదును కూటమి ప్రభుత్వం ద్వారా ఖాతాలోకి జమ అయింది. దీంతో ఆ కుటుంబంలో హర్షాతిరేకాలు వెల్లువేత్తడంతో ఆ కుటుంబాన్ని శనివారం పెద్దాపురం ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప, డిసిసిబి ఛైర్మన్, జనసేన పార్టీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు తుమ్మల రామస్వామితో కలిసి విద్యార్థులను పలకరించారు. విద్యార్థులను ఉన్నతమైన చదువు చదివించాలని తల్లిదండ్రులకు సూచించి విద్యార్థులను వారు ఆశీర్వదించారు. కొంత సమయం వారు కుటుంబంతో సంతోషాన్ని పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ పట్టణ అధ్యక్షుడు సరోజ వాసు, పట్టణ టిడిపి అధ్యక్షుడు అడబాల కుమారస్వామి, కౌన్సిలర్ బలుసు వాసు, గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ బడుగు శ్రీకాంత్, నిమ్మకాయల కిరణ్, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త మంచెం సాయిబాబు, నాయకులు మడగల శ్యామ్ కుమార్, చినబాబు, తుమ్మల ప్రసాద్, అత్తిలి కృష్ణ, అత్తిలి సతీష్, తుమ్మల శ్రీను, కమిరెడ్డి సాయి నాయుడు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



శ్రీగౌతమి హైస్కూల్లో ఉత్తమ విద్య

ప్రజాశక్తి-గొల్లప్రోలు


విద్యార్థులకు ఉత్తమ విద్య క్రమశిక్షణ ప్రమాణాలతో కూడిన విద్యను అభ్యసించడమే లక్ష్యమని గొల్లప్రోలు మండలంలోని చేబ్రోలు శ్రీ గౌతమి హైస్కూల్ కరస్పాండెంట్ ఓదూరి సూర్యనారాయణ తెలిపారు. విద్యారంగంలో చేబ్రోలు శ్రీగౌతమి హైస్కూల్‌కు విశిష్ట స్థానం ఉందని, 2024-25 పదో తరగతి ఫలితాల్లో గొల్లప్రోలు మండలంలో నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించిన ఏకైక విద్యాసంస్థగా శ్రీగౌతమి హైస్కూల్ నిలిచిందని తెలిపారు. విశాలమైన తరగతి గదులతో పాటు డిజిటల్ క్లాస్ రూమ్ విద్యా బోధన సృజనాత్మకమైన కళల ద్వారా పిల్లల యొక్క ఆలోచన విధానాన్ని పెంపొందించడమే కాక వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపించి విద్యార్థి వ్యక్తిగత వికాసానికి తోడ్పడేలా ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. 2024-25 నవోదయ ఫలితాల్లో ఓపెన్ కేటగిరీలో శ్రీ గౌతమి విద్యార్థులు ముగ్గురు ఎంపికయ్యారని, ఐఐటి ఫౌండేషన్ క్లాసులు విద్యార్థులు పోటీ పరీక్షల్లో పాల్గొనే విధంగా శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. స్కూల్లో విద్యార్థులు గ్రాడ్యుయేషన్ డే పోటీ పరీక్షల్లో, జన విజ్ఞాన వేదిక నిర్వహిస్తున్న చెకుముకి టాలెంట్ టెస్ట్, ప్రభుత్వం నిర్వహించే క్రియా పిల్లల పండుగ కార్యక్రమంలో శ్రీగౌతమి హైస్కూల్ విజయపరంపర మోగిస్తోందన్నారు.



స్కూల్ ప్రత్యేకతలు

- విశాలమైన తరగతి గదులు
- నర్సరీ నుంచి అన్ని తరగతుల వారికీ డిజిటల్ క్లాస్ రూమ్,
- ప్రతిరోజు స్టడీ అవర్స్
- పిల్లల యొక్క ఆలోచన విధానాన్ని పెంపొందించుట
- మూడో తరగతి నుండి కంప్యూటర్ బోధన
- వెనుకబడిన విద్యార్థినీ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ
- ప్రతి నెలా తల్లిదండ్రుల సమావేశం
- వ్యక్తిత్వ వికాసానికి తోడ్పడేలా ప్రత్యేక శిక్షణ
- పోటీ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ, క్రీడలు
- కళారూపాలపై ప్రత్యేక శ్రద్ధ


శ్రీగౌతమి విద్యార్థులు


జయప్రకాశ్ నారాయణతో విద్యార్థులు



క్రియ పిల్లల పండుగలో విద్యార్థులు

సంక్షేమంలో కోత..పన్నులతో వాత..

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

ఏడాది పాలనలో సంక్షేమం కోత, పన్నుల పెంపుతో వాత పెట్టిన కూటమి పాలకులు తమది సుపరిపాలన అంటూ చేస్తున్న ప్రచార ఆర్భాటం వారి చిత్తశుద్ధికి దర్పణం పడుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచిన విషయం విధితమే. ఈ నేపథ్యంలో ప్రభుత్వం చేసిన ప్రచారం మన్నంటింది. అయితే ఏడాది పాలనను సమీక్షించుకుంటే సామాన్యులకు ఒరిగిందేమీ లేదనేది సుస్పష్టం. ఎన్నికల ముందు ప్రకటించిన సూపర్ సిక్స్ నేటికీ పూర్తి స్థాయిలో పట్టాలెక్కలేదు. తాజాగా విడుదల చేసిన అమ్మ ఒడిలోనూ షరతుల మెలిక లక్షలాది మంది లబ్ధిదారులను దూరం చేస్తోంది. విద్యార్థుల ఫీజు రియంబర్స్‌మెంట్ ఊసే లేదు. దీంతో కాలేజీల యాజమాన్యాలు సర్టిఫికెట్లు జారీ నిలిపివేయటంతో పట్టభద్రుల పరిస్థితి అయోమయంగా మారింది. ఖరీఫ్ సాగు ప్రారంభమైనా నేటికీ సుఖీభవ రాకపోవటంతో పెట్టుబడి ఖర్చుల కోసం రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు. తాజాగా ఆస్తి పన్నులు అసాధారణంగా పెంచుతూ విడుదల చేసిన జిఒ పట్టణవాసులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. గత ప్రభుత్వం ఏడాదికి 10 శాతం పెంపును వ్యతిరేకిస్తూ విమర్శలు గుప్పించిన టిడిపి అధినేత తాజాగా 35 శాతం వరకూ పన్నులు పెంచుతూ జిఒను విడుదల చేయటం విస్మయానికి గురి చేస్తోంది. ఈ నేపథ్యంలో ఇంటి యజమానులు సైతం అద్దెల రూపంలో పన్నులు చెల్లించే దుస్థితి తలెత్తింది. అద్దెదారులపై పరోక్షంగా ఈ భారం పడనుండటంలో ఎటువంటి సందేహమూ లేదు. 'విద్యుత్ ఛార్జీలు పెంచబోము అవసరమైన మేరకు తగ్గిస్తామంటూ ఇచ్చిన హామీ విద్యుత్ వినియోగదారులను వెక్కిరిస్తోంది. ఇప్పటికే సర్‌ఛార్జీల బాదుడుకు రెండు సార్లు తెరలేపిన ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల బాంబును అంటించింది. ఇప్పటికే వాణిజ్యం సంస్థలకు ఛార్జీల మోత మోగుతోంది. తాజాగా గృహ వినియోగదారులకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసేందుకు సమాయత్తమవుతోంది. మొత్తంమీద మూలిగే నక్కపై తాటికాయ పడ్డ చందంగా ప్రజల పరిస్థితిని దిగజార్చిన ప్రభుత్వం తొలి ఏడాది పేరుతో సంబరాలు చేయటం క్షేత్రస్థాయిలో ప్రజలతో పాటు, కూటమి కార్యకర్తలను కలవరానికి గురిచేస్తోంది.

ఎట్టకేలకు తల్లికివందనం

కూటమి ప్రభుత్వం ఎట్టకేలకు విడుదల చేసిన తల్లికి వందనం విమర్శలకు దారితీసింది. గత ప్రభుత్వం నాలుగేళ్లు అమ్మఒడి పేరుతో ఇదే పథకం అమలు చేసిన విషయం విధితమే. ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అంత మందికీ అమలు చేస్తామని చెప్పిన కూటమి నేతలు అధికారంలోకి వచ్చిన ఏడాది వరకూ ఈ పథకం ఊసెత్తలేదు. తాజాగా అమలు చేసినప్పటికీ నిబంధనలలో ఎటువంటి సడలింపూ చేయలేదు. ఇది చాలదన్నట్లుగా ఇంట్లో ఒక్కరికి ఫీజు రియంబర్స్‌మెంట్ వస్తే ఆ ఇంట్లో ఈ పథకం వర్తించకపోవటం, విద్యాహక్కు చట్టం క్రింద ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థలలో చదువుతున్న పిల్లల తల్లుల ఖాతాకు బదులుగా విద్యా సంస్థ ఖాతాలో అమలు చేస్తామనటం తదితర నిబంధనలు ప్రభుత్వ చిత్తశుద్ధికి దర్పణం పడుతున్నాయి. క్షేత్రస్థాయిలో విద్యార్థుల నుంచి ఎటువంటి ధృవీకరణ పత్రాలు సేకరించకుండానే పాఠశాలల ప్రారంభం రోజునే తల్లికి వందనం అంటూ ప్రచారం చేసిన ప్రభుత్వం ఆచరణలో నాలుక కరుచుకోక తప్పలేదు. సాంకేతిక లోపాలు కారణం చెప్పి జులై 5 నాటికి పూర్తిగా జమ చేస్తామంటూ చెప్పడం విమర్శలకు దారి తీస్తోంది. ప్రభుత్వం ఇప్పటికైనా చిత్తశుద్ధితో వ్యవహరించి అర్హులైన ప్రతి ఒక్కరికీ తల్లికి వందనం పథకం ఫలాలను అందించాలి. లేకపోతే ప్రజా వ్యతిరేకత మూటగట్టుకోక తప్పదని స్పష్టమవుతోంది.

ఖరీఫ్‌సాగుకు ఊతమేది

ఖరీఫ్ సాగుకు సమాయత్తమవుతున్న రైతన్నలకు ప్రభుత్వ చేయూత కరువైంది. అన్నదాత సుఖీభవ పథకం నేటికీ ప్రకటనలు దాటి ఆచరణలో అమలుకు నోచుకోలేదు. రబీ పంట దిగుబడులు కొనుగోలులో నూ, కొనుగోలు చేసిన ధాన్యం నగదు చెల్లింపులలోనూ రైతులను ఇబ్బందులకు గురి చేసిన ప్రభుత్వం మరోవైపు బ్యాంకు రుణాల మంజూరులో నిబంధనల కొర్రి పెట్టింది. దీంతో ఈ ఏడాది ఖరీఫ్ సాగు పెట్టుబడి రైతులకు గోరుచుట్టుపై రోకలి పోటులా మారింది. దీంతో ప్రయివేట్ అప్పులకు పరుగులు తీయక తప్పటం లేదు. పరపతి ఉన్న రైతులకు మినహా మిగిలిన వారికి అప్పులు లభించే పరిస్థితి లేదు. కౌలు రైతుల పరిస్థితి ఇంకా దయనీయంగ మారింది. అధిక వడ్డీలకు తెచ్చి సాగుకు ఉపక్రమించక తప్పేలా లేదు. కాల్వలకు నీరు వదిలేయటంతో డెల్టా రైతులు ఇప్పటికే అక్కడక్కడా సాగును ప్రారంభించినా మెట్ట రైతులు ప్రభుత్వ సాయం కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి త్వరిత గతిన రైతులకు పెట్టుబడి సయం అందించేందుకు చర్యలు చేపట్టి జిల్లాలోని రైతన్నకు సాగుకు ఊతం ఇవ్వాల్సి ఉంది.

లక్ష్యాల యోగాంధ్ర

పిల్లితో చెలగాటం ఎలుకకు ప్రాణసంకటం అన్న చందంగా క్షేత్రస్థాయి ఉద్యోగులపై యోగాంధ్ర లక్ష్యాల భారం పడింది. ప్రభుత్వ శాఖలలో సిబ్బంది కొరత నేపథ్యంలో ఇప్పటికే పని భారంతో అవస్థలు పడుతున్న ఉద్యోగులకు ప్రభుత్వం యోగాంధ్ర నిర్వహణ అప్పజెప్పింది. క్షేత్రస్థాయిలో నమోదుతో మొదలై గత మూడు వారాలుగా యోగా కార్యక్రమాలకు సామాన్యులను తరలించటం ఉద్యోగులకు కత్తిమీద సాములా మారింది. లక్ష్యానికి అనుగుణంగా ప్రజలను తరలించకపోతే ఎక్కడ ఉన్నతాధికారుల ఆగ్రహానికి గురవుతామోననే ఆందోళన వెంటాడుతోందది. ఈ నేపథ్యంలో క్షేత్రస్థాయి అధికారులు ప్రజలను బుజ్జగించే దశ దాటి బెదిరింపులకు సైతం పాల్పడక తప్పటం లేదు. ఈ కార్యక్రమాలకు రాకపోతే ప్రభుత్వ పథకాలు నిలిపివేస్తామంటూ క్షేత్రస్థాయి రెవెన్యూ సిబ్బంది హెచ్చరించటం విస్మయానికి గురి చేస్తోంది.



నేరాలు ఘోరాలు

విద్యుదాఘాతంతో లారీ మెకానిక్ మృతి

ప్రజాశక్తి - రావులపాలెం

విద్యుత్ షాక్ తగిలి లారీ మెకానిక్ మృతి చెందిన ఘటన రావులపాలెం మండలం రావులపాడులో శుక్రవారం రాత్రి జరిగింది. ఎస్ఐ ఎన్.రాము తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అంబాజీపేట మండలం కముజువారి లంక గ్రామానికి చెందిన వాసంశెట్టి పల్లంరాజు (50) రావులపాలెం మండలం రావులపాడులోని మురళీకృష్ణ ఆటో గ్యారేజ్ పేరుతో లారీ మెకానిక్ పనులు చేస్తుంటాడు. షెడ్డు వద్ద శుక్రవారం పల్లంరాజు టిప్పర్ లారీకి రిపేరు చేస్తుండగా లారీ డ్రైవర్ కోటేశ్వరరావు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా లారీ లిఫ్టు క్యాబిన్ పైకి లేపాడు. దీంతో లిఫ్టు పైన ఉన్న 11 కెవి విద్యుత్ తీగలు తగిలి విద్యుత్ షాక్‌తో మురళీకృష్ణ అక్కడికక్కడే మృతి చెందాడు. మతుని భార్య వాసంశెట్టి పల్లాలమ్మ శనివారం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాము తెలిపారు.

చెట్టు పైనుంచి పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - మామిడికుదురు

నగరంలో తాడి వారి మెరకకు చెందిన తాడి అశోక్ కుమార్(35) శుక్రవారం కొబ్బరి చెట్టుపై నుంచి పడి తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని కుటుంబ సభ్యులు రాజోలు ప్రభుత్వ హాస్పటల్ కు తరలిస్తుండగా మృతి చెందాడు. మృతుని భార్య నాగమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ ఎ చైతన్య కుమార్ శనివారం తెలిపారు పెయింటర్ గా జీవనోపాధి పొందుతున్న మతుడు పిల్లలకు అనారోగ్యంగా ఉండడంతో బొండం కోసం చెట్టు ఎక్కి పడిపోయి తీవ్రంగా గాయపడ్డాడు. అశోక్ కుమార్ మృతితో భార్య, 15 ఏళ్ల కుమార్తె స్వప్న, 13ఏళ్ల కుమారుడు సంతోష్ నిరాశ్రయులయ్యారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు

298 అడవి తాబేళ్లు స్వాధీనం

ప్రజాశక్తి - గోకవరం

స్థానిక మెయిన్ రోడ్డు పక్కన గల కాజ.రామ్‌కుమార్‌కు చెందిన స్థలంలో అనుమానాస్పదంగా ఉన్న 7 గోనె సంచులలో ఉన్న 298 సముద్రపు తాబేళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తాబేళ్లను అక్రమ రవాణా చేసే వారిని గుర్తించి వారిపై చర్యలు తీసుకుంటామని ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు. తాబేళ్ల సంరక్షణ నిమిత్తం అటవీ శాఖ అధికారులకు అందజేసినట్లు తెలిపారు. వన్య ప్రాణులను అక్రమ రవాణా చేసే వారిపై నిఘా పెట్టామని తెలిపారు.

గంజాయి తరలిస్తున్న ముఠా అరెస్ట్

ప్రజాశక్తి - కొవ్వూరు

గంజాయిని తరలిస్తున్న ఏడుగురు సభ్యుల ముఠాను శనివారం రోడ్ కం రైలు వంతెన సమీపంలో అరెస్టు చేసినట్లు సిఐ పి.విశ్వం తెలిపారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను ఆయన మీడియాకు వెల్లడించారు. వీరి నుంచి 26 కిలోల గంజాయిని, రెండు కత్తులు, రూ.1,130 నగదు, ఐదు సెల్‌ఫోన్లు, రెండు ఇనుప రాడ్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ తినమంత్ర మండలం మార్టేరు గ్రామానికి చెందిన పాకా వంశీ, తణుకు పట్టణానికి చెందిన ఇజ్జాడా పాపి నాయుడు, పెరవలి మండలం అజ్జరం గ్రామానికి చెందిన మర్రి శామ్యూల్, పాలంగి సుబ్బరాజు, కాండ్రేగుల గురుప్రసాద్, పెరవలికి చెందిన చిన్నమిల్లి శివకృష్ణ, సవరపు ప్రవీణ్‌ను అరెస్ట్ చేసినట్లు సిఐ తెలిపారు. ఈ ఏడుగురు సభ్యుల ముఠా శ్రీకాకుళం జిల్లా చిలకపాలెంలో బంగారు దుకాణం లూటీ చేయడానికి ప్రణాళిక సిద్ధం చేసుకున్నట్లు విచారణలో తేలింది అన్నారు. ముఠాను అరెస్టు చేయడంలో తాళ్లపూడి ఎస్ఐ రామకృష్ణ, కొవ్వూరు ఎస్ఐ టి.రామకృష్ణ పాల్గొన్నారు.

విజయవంతంగా యోగా ట్రయల్ రన్

ప్రజాశక్తి - పెద్దాపురం

ఈ నెల 21న జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా మండల పరిధిలో శనివారం యోగా ట్రయల్ రన్ విజయవంతంగా నిర్వహించినట్లు ఎంపిడిఒ డి.శ్రీలలిత తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ మండల పరిధిలో 23 గ్రామాలకు సంబంధించి 20 సచివాలయాల పరిధిలో ఈ ట్రయిల్ రన్ నిర్వహించినట్టు తెలిపారు. ప్రతి సచివాలయ పరిధిలో ఐదు ప్రదేశాలలో ఈ రన్ నిర్వహించారన్నారు.



నివాళులర్పిస్తున్న వైసిపి నాయకులు

విమాన ప్రమాద మృతులకు సంతాపం

ప్రజాశక్తి-శంఖవరం

అహ్మదాబాద్‌లో ఇటీవల జరిగిన విమాన ప్రమాదంలో మృతి చెందిన వారికి సంతాపంగా కొవ్వొతులతో ర్యాలీ చేపట్టారు. ప్రత్తిపాడు వైసిపి ఇన్‌ఛార్జి ముద్రగడ గిరిబాబు ఆదేశాల మేరకు శనివారం రాత్రి సర్పంచ్ ఎస్.కుమార్ రాజా ఆధ్వర్యంలో నాయకులు పెద్ద రావి చెట్టు సెంటర్ వద్ద అంబేద్కర్ కూడలి నుంచి గాంధీ విగ్రహం వరకూ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. గాంధీ బొమ్మ వద్ద నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సరమళ్ల మధుబాబు, ఎస్.రాము, బిఎస్‌వి.ప్రసాద్, జి.బాబ్జి, బి.హరిబాబు, కె.రాజు, బి.రవికుమార్ పాల్గొన్నారు.

రెడ్ క్రాస్ ఆధ్వార్యాన ర్యాలీ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కె ఆధ్వర్యంలో కళాశాలలో రెడ్ క్రాస్ వాలంటీర్లు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భం గా మానవహారంగా ఏర్పడి రక్తదాతల కోసం ప్రతిజ్ఞను చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రామచంద్ర, యూత్ రెడ్ క్రాస్ కోఆర్డినేటర్ జి.రవితేజ మాట్లాడారు. రక్తదానం చేయడం వలన హృదయ సంబంధమైనటువంటి వ్యాధులను దూరం చేసుకోవచ్చునని అన్నారు. దేహంలో ఉన్నటువంటి కొవ్వును తగ్గించుకోవ చ్చునని, కాలేయ వ్యాధులను దరిచేరకుండా చేసుకోవడానికి ఆస్కారం ఉంటుందన్నారు.

సాయం కోసం వ్యాధిగ్రస్తుని ఎదురుచూపు

ప్రజాశక్తి-గండేపల్లి

మండల కేంద్రమైన గండేపల్లికి చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన కటకం వెంకటరమణ అరుదైన హీమోఫిలియా వ్యాధితో బాధ పడుతున్నారు. ఈ వ్యాధికి సంబంధించి వైద్యానికి రూ.10 లక్షల ఖర్చు అవుతుందని వైద్యులు చెప్పడంతో ఆంధ్ర, తెలంగాణలో వైద్యులు లేకపోవడంతో సిఎం రిలీఫ్ ఫండ్ నుంచి ఇచ్చేందుకు ప్రయత్నం చేసినా దానికి అనర్హులని తెలిపారు. వైద్యానికి సంబంధించి దాతలు సాయం చేయాలని ఆయన కోరుతున్నారు. వెంకటరమణకు ఇద్దరు ఆడపిల్లలు, సొంత ఇల్లు లేని పరిస్థితిలో ఉన్నారు. ఆయనకు సాయం చేయాలనుకునేవారు గ్రామానికి చెందిన పసుమర్తి సుబ్రహ్మణ్యం ఫోన్ పే నెంబర్ 9948387308కు నగదు పంపించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక వెంకటేశ్వర స్వామి గుడి సెంటర్‌లో పాల అప్పారావు షాపు సమీపంలో విద్యుత్తు తీగలను చెట్టు కొమ్మలు, లతలు అల్లుకుపోయి ప్రమాదకరంగా మారినా విద్యుత్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. ఉదయం నుండి రాత్రి 10 గంటల వరకు నిరంతరాయంగా ఈ రహదారిలో వాహనాలపై ప్రజలు ప్రయాణిస్తూనే ఉంటారు. ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభమైనందున ఈ విద్యుత్ తీగల ద్వారా విద్యుత్ చెట్టు కొమ్మలకు, లతలకు ప్రవహించి నిప్పులు రాల్చడంతో పాటు, రహదారిలో వెళ్లే ప్రజలకు ప్రమాదం జరిగే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ రహదారిలోని అన్ని విద్యుత్తు తీగలను చెట్టు కొమ్మలు, లతలు అల్లుకుపోయి ప్రమాదకరంగా తయారైనందున వెంటనే ఈ కొమ్మలు, లతలను తొలగించాలని ప్రజలు అధికారులకు విజ్ఞప్తి చేశారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-గొల్లప్రోలు

ఆదివారం మధ్యాహ్నం 2- 30 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పట్టణంలోని పాపయ్య చావిడి, రామాలయం వద్ద ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని జయంతి కంటి ఆసుపత్రి వైద్యులు డాక్టర్ శ్రీకాంత్ తెలిపారు. ఈ శిబిరంలో తలనొప్పి, చత్వారం, కంటి మసక వంటి వాటికి కంటి పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తామని,శుక్లాలు ఉన్నవారికి అతి తక్కువ ఖర్చుతో జయంతి ఆసుపత్రిలో ఆపరేషన్లు నిర్వహిస్తామని తెలిపారు.

రైతులు ఇకెవైసి తప్పనిసరిగా చేసుకోవాలి

ప్రజాశక్తి-రౌతులపూడి

రైతులకు ప్రభుత్వం అందిస్తున్న అన్నదాత సుఖీభవ పథకం మంజూరు కావాలంటే తప్పనిసరిగా ఆయా గ్రామ సచివాలయాల్లో ఇకెవైసి చేయించుకోవాలని వ్యవసాయ అధికారి రెడ్డి ఈశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 20వ తేదీ లోగా ఆయా గ్రామా రైతు సేవ కేంద్రాల్లో ఈ ప్రక్రియ నమోదు చేయించుకోవాలని పేర్కొన్నారు.

శాస్త్రీయ పద్ధతులతో అధిక దిగుబడులు

ప్రజాశక్తి - పెద్దాపురం

కర్ర పెండలం దుంప రైతులు శాస్త్రీయ యాజమాన్య సాగు విధానాలను పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని స్థానిక వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త ఎం.జానకి అన్నారు. శనివారం ఆమె మాట్లాడుతూ వ్యవసాయాధికారుల సూచనల మేరకు మేలైన విత్తనపు కర్రను ఎంపిక చేసుకోవాలన్నారు. దుంప పంట తీత అనంతరం మేలైన దుంప కర్రలను ఎంపిక చేసుకుని వాటిని విత్తనపు కర్రలుగా నీడలో ఉంచాలన్నారు. 7 నుండి 10 నెలల వయసు కలిగిన చీడపీడలు లేని మొక్కల నుంచి బలమైన కొమ్మలను విత్తనపు కర్రగా ఎంపిక చేసుకోవాలన్నారు. ఎంపిక చేసిన విత్తనపు కర్ర రెండు వైపులా చివరి భాగాలను తొలగించి 20 సెంటీమీటర్ల పొడవు గల ముచ్చులుగా సిద్ధం చేసుకోవాలన్నారు.

శృంగార వల్లభునికి రూ.3.45 లక్షల ఆదాయం

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని తిరుపతి గ్రామంలో శ్రీశృంగార వల్లభ స్వామి ఆలయానికి శనివారం ఒకరోజు మొత్తం రూ.3,45,190 ఆదాయం సమకూరిందని ఆలయ ఇఒ వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. వివిధ ప్రత్యేక దర్శనం టికెట్ల ద్వారా రూ.2,34,370, అన్నదాన విరాళాల ద్వారా రూ.72,154, కేశఖండన ద్వారా రూ.10,040, తులాభారం ద్వారా రూ.550, లడ్డూ ప్రసాదం ద్వారా రూ.27,960, స్వామివారికి కార్మికుల ద్వారా రూ.116 సమకూరిందని తెలిపారు. ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, పెద్దింటి నారాయణాచార్యులు, ఆలయ సిబ్బంది, స్వచ్ఛంద సేవకులు, గ్రామస్తులు యాత్రికులకు సేవలందించారన్నారు.

పెద్దనాపల్లి విద్యార్థినికి నీట్‌లో 33వ ర్యాంక్

ప్రజాశక్తి-ఏలేశ్వరం

కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన మెడికల్ కళాశాలల ప్రవేశ పరీక్ష (నీట్)లో పెద్దనాపల్లికి చెందిన బాలిక సత్తా చాటింది. సాధారణ రైతు కుటుంబంలో జన్మించిన గొల్లపల్లి వైష్ణవి ఆలిండియా ఇడబ్ల్యుఎస్ కోటాలో 33వ ర్యాంకు కైవసం చేసుకుంది. చిన్నతనం నుండి విద్య పట్ల వైష్ణవి చూపిస్తున్న మక్కువను గుర్తించిన తండ్రి గొల్లపల్లి సుబ్రహ్మణ్యం పదో తరగతి వరకూ రాజమహేంద్రవరంలో, ఇంటర్మీడియట్ విద్య విజయవాడలో చదివించారు. తండ్రి నమ్మకాన్ని వమ్ము చేయకుండా పదో తరగతిలో 583/600 మార్కులు, ఇంటర్‌లో 984/1000 మార్కులు సాధించింది. నీట్ ప్రవేశ పరీక్షలో నాలుగు సబ్జెక్టులలో 99.93 శాతం పైగా మార్కులు సాధించింది.

నవోదయ టీచర్స్, పేరెంట్స్ కౌన్సిల్ ఎన్నిక

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక జవహర్ నవోదయ విద్యాలయ పేరెంట్స్, టీచర్స్ కౌన్సిల్ ఎగ్జిక్యూటివ్ బాడీ ఎన్నికలు శనివారం ప్రశాంతంగా జరిగాయి. ప్రిన్సిపల్ బి.సీతాలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ ఎన్నికలలో పేరెంట్స్ తరుపున టి.దుర్గ, ఎం.కిషోర్, ఎస్.ఆదిలక్ష్మి, ఎ.నారాయణ, ఎం.రామలింగేశ్వరరావు, కె.ఉష, శ్రీనివాస్, జి.విష్ణు, పి.శ్రీనివాస్, ఎన్.సూరిబాబు ప్రతినిధులుగా ఎంపికయ్యారని ప్రిన్సిపల్ సీతాలక్ష్మి తెలిపారు. విద్యాలయ నుంచి సనపల సత్యనారాయణ, డి.చక్రవర్తి, పి.జగన్‌మోహన్ రావు, వి.ప్రేమలత, మధుబాల కమిటీ సభ్యులుగా ఎంపికయ్యారన్నారు. ఎన్నికల అనంతరం వైస్ ప్రిన్సిపల్ కె.రామకృష్ణయ్య మాట్లాడుతూ నవోదయ విద్యాలయ అభివృద్ధికి, పురోగతికి పేరెంట్స్ సహాయ సహకారాలు ఎల్లప్పుడు ఎంతో అవసరం అన్నారు.

ప్రపంచ యోగా డేకు ఏర్పాట్లు

ప్రజాశక్తి-తాళ్లరేవు, జగ్గంపేట

ఈ నెల 21న ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ప్రపంచ యోగా దినోత్సవ సన్నద్ధత కార్యక్రమం తాళ్లరేవు మండలం కోరంగి పంచాయితీ పరిదిలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు యోగా శిక్షకులు యోగాసనాలపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమాలలో సర్పంచ్ పెయ్యాల మంగేష్, శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ టేకుమూడి లక్ష్మణరావు, పంచాయతీ కార్యదర్శి విజెవిరమణ, సచివాలయ కార్యదర్శులు లహరిక, విజయ్, మాజీ జెడ్‌పిటిసి పొన్నమండ రామలక్ష్మి, కూటమి నాయకులు వాడ్రేవు వీరబాబు, గ్రామ కమిటీ అధ్యక్షుడు కొప్పిశెట్టి చంటి, చంద్రాల బాబి, దాసరి వేణుగోపాల్, దడాల భైరవమూర్తి, దత్తాత్రేయ, అత్తిలి బాబూరావు, సిపిఎం నాయకులు టేకుమూడి ఈశ్వరరావు, వార్డు సభ్యులు బర్రే కాటవేణి, సత్యవేణి, సంగాడి శ్రీనివాస్, కడలి శ్రీను, యోగా శిక్షకులు, ప్రజలు పాల్గొన్నారు.

జగ్గంపేట మండలంలోని 16 గ్రామ పంచాయతీల పరిధిలో శనివారం యోగాంధ్ర ప్రయోగాత్మక పరీక్ష నిర్వహించారు. ఈ నెల 21న యోగాంధ్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎంపిడిఒ ఎవిఎస్.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో మండలంలోని అన్ని గ్రామాల్లో సచివాలయ ఉద్యోగులు ప్రజలతో యోగా చేయించారు. మండల కేంద్రమైన జగ్గంపేటలోని నాలుగు సచివాలయల ఉద్యోగులు ప్రజలతో, విద్యార్థులతో ట్రయల్ రన్ యోగ నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి జి.శివ పాల్గొన్నారు.

శానిటరీ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణకు సత్కారం

ప్రజాశక్తి - ముమ్మిడివరం



శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను సత్కరిస్తున్న సిబ్బంది తదితరులు

నగర పంచాయతీ శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తూ, బదిలీపై వెళ్తున్న జంపన సత్యనారాయణ రాజును శానిటరీ సిబ్బంది శనివారం ఘనంగా సత్కరించారు. ముమ్మిడివరం నగర పంచాయతీ కార్యాలయం నందు శనివారం నిమ్మకాయల వెంకటేష్ అధ్యక్షతన సన్మాన కార్యక్రమం జరిగింది. తొలుత నగర పంచాయతీ శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తూ,సాధారణ బదిలీల్లో భాగంగా భీమవరం మున్సిపాలిటీకి వెళ్తున్న సత్యనారాయణ రాజుకు పలువురు కార్మికులు శాలువా కప్పి, పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సచివాలయం శానిటరీ సెక్రటరి విజయ భాస్కర్ మాట్లాడుతూ నగర పంచాయతీలో ఎక్కడ పారిశుధ్య సమస్య తలెత్తకుండా కార్మికులను సమన్వయం చేసుకుంటూ విధుల్లో అంకిత భావంతో పని చేసి అందరి మన్ననలు పొందడం సత్యనారాయణ రాజు పనితనానికి నిదర్శనమన్నారు. ఈకార్యక్రమంలో సచివాలయం సెక్రటరీలు రాజీవ్, నవీన్, ప్రదీప్ పారిశుధ్య కార్మికులు బుంగా కుమారస్వామి, కాకి రాంబాబు, దొంగ నాగ ప్రసాద్, రేవు వెంకటలక్ష్మి, పలివెల నాగలక్ష్మి, బొమ్మి నాగలక్ష్మి, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

75 మందికి కంటి పరీక్షలు

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

గున్నేపల్లి అగ్రహారం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద గ్రామ సర్పంచ్ పెద్దిరెడ్డి రామచంద్రరావు అధ్యక్షతన అనాతవరం నాగసాయి ప్రైమరీ ఐ కేర్ ఆప్టికల్స్ వారిచే శనివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరం లో సుమారు 75 మందికి ఉచిత కంటి పరీక్షలు, దంత పరీక్షలు చేశారు. ఉచితంగా డ్రాప్స్ బాటిల్స్ ఇచ్చారు. అలాగే చత్వారం, తలనొప్పి, దూర దృష్టిలోపం ఉన్నవారికి పరీక్షలు చేసి అతి తక్కువ ధరల్లోనే నాణ్యమైన కళ్ళజోళ్లు అందజేశారు. దానితోపాటుగా ఉచితంగా చుక్కల మందులు, చుక్లాలు ఉన్నవారికి ఉచిత కంటి ఆపరేషన్లు చేస్తారు. కార్యక్రమంలో పెద్దిరెడ్డి శ్రీరామ మూర్తి, శ్రీకాకుళపు సురేష్, పెద్దిరెడ్డి చిన వెంకటేశ్వరరావు, పెద్దిరెడ్డి సురేష్, కేత వెంకటరమణ, ఆశా వర్కర్లు,గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

కల్వర్టు నిర్మాణ పనుల పరిశీలన

ప్రజాశక్తి - మండపేట

చినద్వారపూడి వద్ద జరుగుచున్న కల్వర్టు నిర్మాణ పనులను శనివారం రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్, ఎంఎల్‌ఎ వేగుళ్ల జోగేశ్వరరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్వర్టు పనులు ను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రైతులకు ఇబ్బంది కలగకుండా నీరు ప్రవాహానికి అడ్డుపడిన మట్టిని వెంటనే తొలగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చోడె పాపారావు, పాలచర్ల శిరీష్, శెట్టి రవి తదితరులు, పాల్గొన్నారు.

పలువురు కుటుంబ సభ్యులకు పరామర్శ

మండపేట నియోజకవర్గంలో ఇటీవల మరణించిన పలువురు కుటుంబ సభ్యులను శనివారం రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్, ఎంఎల్‌ఎ వేగుళ్ళ జోగేశ్వరరావు పరామర్శించారు. ఇటీవల మరణించిన మండపేట పట్టణం 12వ వార్డులో కోరా మాణిక్యాంబ, 21వ వార్డులో రెడ్డి వెంకట్రావు, 22వ వార్డులో వల్లూరి సుశీల కుటుంబ సభ్యులను, మండపేట మండలం, అర్తమూరు లో తాడి వెంకటరెడ్డి, కొవ్వూరి రాఘవ రెడ్డి, ఇప్పనపాడులో ఇళ్ళ విష్ణుమూర్తి కుటుంబ సభ్యులను, రాయవరం మండలం, మాచవరం లో మేడపాటి సత్యనారాయణరెడ్డి, మల్లేశ్వరపు అచ్చియమ్మ, మల్లిడి హరిగోపాలరెడ్డి కుటుంబ సభ్యులను, కపిలేశ్వరపురం మండలం, అచ్యుతాపురం గ్రామంలో పాలగుత్తి కృష్ణవేణి కుటుంబ సభ్యులను ఎంఎల్‌ఎ పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ పరామర్శలలో ఎంఎల్‌ఎ వెంట జిల్లా గ్రంథాల సంస్థ మాజీ ఛైర్మన్ నల్లమిల్లి వీర్రెడ్డి, మాజీ డిసిఎంఎస్ ఛైర్మన్ రెడ్డి ప్రసాద్, పట్టణ టిడిపి మాజీ అధ్యక్షులు ఉంగరాల రాంబాబు, పాలచర్ల కష్ణ బ్రహ్మజి, చింతల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - రామచంద్రపురం

జీతాల పెంపు దల కోసం 27 రోజులుగా కొనసాగుతున్న మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని పిడిఎఫ్ విద్యార్థి సంఘం కోరింది. పట్టణంలోని మున్సిపాలిటీ కార్యాలయం వద్ద న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని సమ్మె చేస్తున్న ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్‌కు పిడిఎస్‌యు విద్యార్థి సంఘం తమ మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి పిడిఎస్‌యు రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్ధు, పిడిఎస్‌యు నాయకులు కె.సురేష్ తదితరులు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 14వేల మంది మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగం కార్మికులు గత 27 రోజులు నుండి సమ్మె చేస్తున్నారని. మున్సిపాలిటీలో అత్యవసర విభాగం ఆయిన నీటి సరఫం , విధి దీపాల కార్మికులు కనీస వేతనం టెక్నికల్ కార్మికులకు రూ.15 వేల నుంచి రూ.29,200 పెంచాలని, నాన్ టెక్నికల్ కార్మికులకు రూ.24,500 పెంచాలని, 15 సంవత్సరాలు పైబడిన కార్మికులను పర్మినెంట్ చేయాలని, విధి నిర్వహణలో మరణించిన కార్మికునికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా, కుటుంబంలో ఒక్కరికి ఉద్యోగం ఇవ్వాలని. సంక్షేమ పథకాలు అమలు చేయాలని, దీర్ఘకాలిక జబ్బులకు గురైన వారికి మెరుగైన కార్పొరేట్ వైద్యం అందించాలని, పెంచిన 10 గంటల పని దినాన్ని రద్దు చేయాలన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు 27 రోజులు నుంచి సమ్మె చేస్తున్న సమ్మె పరిష్కరించకపోవడం సిగ్గుచేటన్నారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని అన్నారు. జిఎస్.శ్రీనివాసరావు, వి.శ్రీనివాస్, జి.ప్రసాద్, బి.రాజు, ఎం.భాగ్యరాజు పాల్గొన్నారు.



వేటకు వెళ్లేందుకు వలలను సిద్ధం చేసుకున్న మత్స్యకారులు

వేటకు సిద్ధమవుతున్న మత్స్యకారులు

ప్రజాశక్తి- యు.కొత్తపల్లి

నేటి నుంచి సముద్రంలో వేట నిషేధం పూర్తి కావడంతో మత్స్యకారులు వేటకు వెళ్లేందుకు బోట్లు, వలలు సిద్ధం చేసుకుంటున్నారు. రెండు నెలలు నుండి వేట లేకపోవడంతో అప్పులు చేసి జీవనం సాగించామని వారు పేర్కొన్నారు. ప్రభుత్వం మత్స్యకార భరోసా ఇచ్చినప్పటికీ కుటుంబ పోషణకు సరిపోలేదని తెలిపారు. రెండు నెలల తర్వాత వేటకు వెళ్తు న్నామని అయితే తుపాను ప్రభావం ఎక్కువగా ఉన్నట్లయితే వేట నిలుపుదల చేసే పరిస్థితులు నెలకొంటున్నాయని తెలిపారు.

నాటు సారా స్థావరాలపై నిఘా

ప్రజాశక్తి-ప్రత్తిపాడు

నియోజకవర్గంలో నాటు సారా స్థావరాలపై నిఘా ఏర్పాటు చేశామని, నాటు సారా కాసినా, అమ్మినా అటువంటి వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుని కేసులు నమోదు చేస్తామని సూర్య అప్పారావు హెచ్చరించారు. నియోజకవర్గంలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు ఎవరు పాల్పడినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. రహదారులపై వాహనాలు వెళ్లే ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, బైకుల మీద వెళ్లే వాహనదారులు ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్సు వాహనదారుడు రికార్డు తప్పనిసరిగా ఉండాలని, మద్యం సేవించి వాహనాల నడిపినా చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. రెండు రోజుల నుంచి మండలంలో పెండింగ్ కేసులను విచారించి ఆ కేసుల్లో ఉన్న వారిని అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరిచామని తెలిపారు.

ఎంఎల్‌ఎ చొరవతో విద్యుత్ సమస్య పరిష్కారం

ప్రజాశక్తి-ఏలేశ్వరం

ఎంతో కాలంగా విద్యుత్ అంతరాయం, లో వోల్టేజ్ సమస్యలతో సతమతమవుతున్న మండలంలోని సిరిపురం, చిన్నింపేట ప్రజలకు ప్రత్తిపాడు ఎంఎలఎ వరుపుల సత్య ప్రభ చొరవతో పరిష్కారం లభించింది. ఆ సిరిపురం గ్రామానికి కూటమి నాయకుడు దనేకుల సత్యనారాయణ విద్యుత్ సమస్యను ఎంఎల్‌ఎ దృష్టికి తీసుకువచ్చారు. ఎంఎల్‌ఎ విద్యుత్ శాఖ ఉన్నతాధికారులతో అధికారులతో చర్చించి నూతన ట్రాన్స్ ఫార్మర్ మంజూరు చేయించారు.

ఎపిపిగా లీల నాగరోజా

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం మెజిస్ట్రేట్ కోర్టు అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ఆకుల లీల నాగ రోజా శనివారం బాధ్యతలు చేపట్టారు. న్యాయవాదుల సాధారణ బదిలీల్లో భాగంగా పిఠాపురం మెజిస్ట్రేట్ కోర్టు నుంచి ఆమె పెద్దాపురం కోర్టుకు బదిలీపై వచ్చారు. శనివారం ఆమె కోర్టు హాల్లో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కటవర్తి సత్యనారాయణ ఆధ్వర్యంలో బార్ అసోసియేషన్ సభ్యులు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

అగ్ని ప్రమాద బాధితులకు సాయం

ప్రజాశక్తి-ఏలేశ్వరం

ఇటీవల సంభవించిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన దెయ్యాల అప్పలరాజు కుటుంబానికి శనివారం హెల్పింగ్ యూత్ సభ్యులు సాయం అందించారు. ఈ మేరకు హెల్పింగ్ యూత్ సభ్యులు అప్పలరాజు కుటుంబాన్ని పరామర్శించి బియ్యం, గృహోపకరణాలు, నగదు అందజేశారు. ఈ సందర్భంగా యూత్ సభ్యులు మాట్లాడుతూ అగ్ని ప్రమాదంలో సర్వస్వం కోల్పోయి రోడ్డును పడ్డ అప్పలరాజు కుటుంబాన్ని స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెల్పింగ్ యూత్ సభ్యులు కోకా వెంకటేష్, ఎస్‌కె.ఆలీషా, ఎస్‌కె.ఆలీ, కె.దుర్గాప్రసాద్, పెండ్యాల రాజు ఉన్నారు.

మండల వ్యవసాయ అధికారిగా మురళీధర్

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట మండల నూతన వ్యవసాయ శాఖ అధికారిగా యు.మురళీధర్ బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం ఎఒగా పని చేస్తున్న ఇమ్మిడిశెట్టి సత్య కరప మండలానికి బదిలీ కాగా, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వ్యవసాయ పరిశోధన కేంద్రం ఎఒగా పని చేస్తున్న మురళీధర్ ఇక్కడికి బదిలీపై వచ్చారు. కాకినాడ ఎడిఎ కార్యాలయంలో మురళీధర్ బాధ్యతలు చేపట్టారు. సోమవారం నుంచి సామర్లకోటలో పూర్తిస్థాయి బాధ్యతలు చేపట్టే అవకాశం ఉన్నట్లు తెలిసింది.

గృహ నిర్మాణానికి సాయం

ప్రజాశక్తి -తాళ్లరేవు

గ్రామపంచాయతీ జెల్లావారి పేటకు చెందిన ఒంటరిగా జీవిస్తున్న వికలాంగుడు నేరేడుమిల్లి ఏడుకొండలు నూతన ఘృహ నిర్మాణానికి గొల్లపాలెం లయన్స్ క్లబ్ సెక్రటరీ జక్కన రాజేష్ రూ.3000 ఆర్థిక సాయం అందజేశారు. రాజేష్ పుట్టిన రోజు సేవా కార్యక్రమంలో భాగంగా శనివారం బాధితునికి ఆ సాయాన్ని అందజేశారు. ఆయన వెంట తాళ్ళరేవు లయన్స్ క్లబ్ ప్రతినిధులు బిళ్లకుర్తి శ్రీనివాస్ రెడ్డి, నున్న దత్తు, రాజు ఉన్నారు.

16న ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి- తాళ్ళరేవు

క్రీమ్ సేవా సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 16న సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు ఆ సంస్థ డైరక్టర్ దొమ్మేటి వసంత రాయుడు, జెడ్‌పిటిసి దొమ్మేటి సామ్యూల్ సాగర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తాళ్లరేవు సంతపేట సెంటర్ హైస్కూల్ పక్కన ఉన్న బాప్టిస్ట్ చర్చిలో ఈ శిబిరం నిర్వహిస్తామని తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ శిబిరం నిర్వహిస్తామని తెలిపారు. శిబిరంలో ఉచితంగా పరీక్షలు నిర్వహించి కళ్లజోళ్లు అందజేస్తామని తెలిపారు. అవసరమైన వారిని గుర్తించి ఆపరేషన్లు ఉచితంగా చేయిస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.